
## గుమ్మా ప్రసన్నకుమార్



# తింపర

"రారా యువార్ వెల్‌కం. ఇదే నా ఇల్లు. అద్దెకొంప. దీని పేరు భయంకర నివాసం. పాత్రల పరిచయం చెయ్యొద్దూ? కమాన్" వాసు లోపలికి నడిచాడు, తూలుతూ.

బజార్లో అనుకోకుండా వాసు కనిపించాడు. గుర్రమెక్కేడని బజార్లో వాడ్ని చూస్తునే అనుకున్నాను. రెండురోజుల పని మీద ఈ ఊరొచ్చాను.

"ఒరే సత్యం" వాసు గట్టిగా పిలిచాడు.

ఏడేళ్ళ అబ్బాయి వచ్చాడు మెల్లిగా. అచ్చు వాసు పోలికే. వాడి వెనుకనే ఒక అమ్మాయి ఓ చిన్న అబ్బాయి వచ్చారు. ఇంకా వెనుక, గుమ్మానికి ఆనుకుని. చూస్తున్నట్లు చీర.

"వీడేరా మా సత్యం. ఒకటో రకం. అసాధ్యుడు. ఈ గూట్లో ఇంత చిల్లరపెట్టు. మరో గంటకి లెక్క సరిగా ఉండదు. తీసేవురా అంటే 'వూహుఁ' అంటాడు. అమాయకుడిలా మొహంపెట్టి ఇలాంటి పని నేనెప్పుడూ చెయ్యలేదు నాన్నా అంటాడు. వాడ్ని సోదా చెయ్యి? నీ డబ్బులు. " గలగలా నవ్వాడు వాసు.

"ఒసే శాంతీ ఇలా రావే. ఇదుగో వీడు నీ మామ. రావే-ఫరవాలేదు. ఇదేరా మా ఇంటి లక్ష్మి. చూడు. ఇదీ దీని బొక్కిపళ్ళూనూ. దీనికున్నంత స్వార్థం మరెక్కడా

చూడవు. నీ వాచీ తీసి, అమ్మడూ ఇది నీదే అని సరదాకే అను. అది మళ్ళీ నీ వాచీ నీకు తిరిగి ఇవ్వదు."

నాకు నవ్వొచ్చింది. కులాసాగా నవ్వు కున్నాను. అప్పటికి మూడోవాడు తండ్రి దగ్గరగా వచ్చాడు—"ఇడుగో వీడు మూడో వాడు అండ్ లాస్టు. పేరు శంకరుడు. ఏదిరా భీముడూ నోరు తెరూ! తెరువమ్మా! తెరు స్తావా చంపేమన్నావా?" కోపంగా చూసి అన్నాడు—"మళ్ళీ మట్టి తింటున్నావా?"

"లేదు నాన్నా!"

"చెప్పు వెధవా! చీరేస్తాను."

బిక్కమొహంవేశాడు శంకర్.

"ఈ వెధవ సంగతి ఇలా ఉంది. వీళ్లురా నా సంతానం. వీళ్ళమీద నాకు నమ్మకం లేదు. వీళ్ళంతా దొంగ వెధవలు! దేవతా కమాన్! రా ఇలారా దగ్గరగా. మరేం పరవాలేదు. వీడు రాజు. అసలుపేరుకూడా అంతే. తల్చు కుంటే మనలాంటి సంసారాల్ని ఓ పదింటిని సునాయాసంగా భరించగలడు."

'దేవత' మెల్లిగా వచ్చింది. ఆమె కళ్లు అశ్రుపూరితా లయ్యాయి. నేను మౌనంగా నిల్చున్నాను. ఇటువంటి డ్రమెటిక్ సీక్వెన్సెస్ నా జన్మలో ఎప్పుడూ జరిగి ఉండలేదు. అలా గని వాసుని ఆపలేను—వాడు మామూలు స్థితిలో లేడు కనుక. ఏం చేయాలో తోచని పరిస్థితిలో తలవంచుకున్నాను. వాడ్ని బజార్లో కలుసుకోడమే తప్పయింది. అసలు ఈ ఊరు రావడమే పెద్ద తప్పు అయిందేమో అను కున్నాను. నాకు కొంచెం దూరంలో చీర గాలికి రెపరెప లాడుతోంది.

"ఇడుగో వీడేనే రాజు. అమలాపురం. పనిమీద ఈ ఊరొచ్చాడుట. ఒరే రాజూ ఇది నా మిసెస్. పేరు అవంతి. బావుందా? మనసు కూడా యెంతో బాగుంటుంది."

నమస్కారం చేశాను అవంతికి.

వాసు మెల్లిగా నడుస్తూ అవంతి దగ్గరకు చేరుకున్నాడు. అవంతి ఎదురుగా మునిగాళ్ళ మీద కూర్చొని, ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవంతి కళ్ళల్లో నీరు కమ్ముకుంటూంది. మునిగాళ్ళమీదే కూర్చుని, నిల్చున్న ఆమె చుట్టూ చేతులువేసి, తన తల ఆమెమీద ఆన్చుతూ, గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు- "ఇదేరా నా దేవత. దీన్ని చూసే నేను బతుకు తున్నాను."


వాసు అలానే కూర్చున్నాడు. అవంతి వారించలేదు అతన్ని. మొహం కప్పుకుని ఏడుస్తోంది. ముగ్గురు పిల్లలూ, నన్నూ నా వాచీని, బాగ్నూ మార్చిమార్చి చూస్తున్నారు. రోజూ మార్పులేని ఈ తతంగం వాళ్ళని అంత ఆశ్చర్యపరిచి ఉండదు.

నేనూ, వాసూ ఒకే బడిలో చదువుకున్నాం. వాసులో చురుకుపాలు యెక్కువ. అన్నింటి లోనూ మంచి మార్కులు సంపాదించుకునే వాడు. అలాంటి వాసుకి ఇటువంటి జీవితం ఊహించుకోలేదేనాడూనూ. జీవితంలో చాలా పైకి వస్తాడనుకునేవాడ్ని. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబమే వాసుది.

చుట్టూ చూశాను. గోడలకి వెల్లవేసి ఎన్నాళ్ళయిందో? గోడలమీద అక్కడక్కడా నల్లి రక్తంచారలు. దండెంమీద గబ్బిలాల్లా మాసిపోయిన బట్టలు—ఎదురుగా పాతకాలపు పందిరి మంచం. దానిమీద మాసిపోయి ఎత్తు పల్లాలతో చింకి పరుపు—రోతగా ఉంది, వాతావరణం.

చప్పుడయింది. వాసు నేలమీద పడి ఉన్నాడు. మత్తు బాగా ఆవరించి ఉంటుంది. అయోమయంగా చూశాను. అవంతి వాసుని లేపి మంచంమీద పడుకోబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ వాతావరణంలో అనుకోకుండా దిగినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

ఆ మత్తులోనే అన్నాడు వాసు "రాజు నా బెస్టు ఫ్రెండ్. ధనికుడు. ఎలాంటి లోటు రాకుండా పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టెయ్. ఏమాత్రం తక్కువయినా భరించను. ఒరే రాజూ. నువ్వు మా ఇంట్లో గెస్టువి. నిన్ను ఆనందపరచడమే మా ప్రధాన ఉద్దేశం. అంచేత " ఇంక మాట్లాడలేక




పోయాడు వాసు. మత్తు పూర్తిగా ఆవరించింది. పందిరి మంచంమీద ఒళ్ళు తెలీకుండా పడుకున్నాడు.

అవంతి అతన్ని చూసి, చీదరింపుతో కోపంగా నిట్టూర్చింది. వంటింట్లోకి వెళ్ళి "సత్యం" పిల్చింది. సత్యం నన్ను చూసి నవ్వుతూ లోపలికి వెళ్ళాడు. అవంతి సత్యం చెవిలో ఏదో చెప్పి ఉంటుంది. ఏదో పట్టుకొని దాచేస్తూ, నాకు చూపెట్టకుండా నన్ను దాటేశాడు.

కొంతసేపు అలాగే నిల్చున్నాను. బోరు కొడుతోంది.

"అమ్మ మిమ్మల్ని స్నానం చెయ్యమంటోంది" శాంతి కాబోలు అంటోంది.

"లేదు పాపా, నేను వెళ్ళిపోతున్నానని అమ్మతో చెప్పు. నాకు చాలా పనులున్నాయి" వెళ్ళింది వెళ్ళినట్టే తిరిగి వచ్చింది శాంతి. ఆమె వెనుకనే వంటింట్లోంచి అవంతి గొంతుక వినిపించింది. "లేచి స్నానం చెయ్యండి."

మరి యెదురు చెప్పలేకపోయాను. లేని పనుల్ని ఉన్నాయని చెప్పి అర్జంటుగా తప్పుకునే తెలివితేటలు నాకు లేవు. స్నానం చేస్తుంటే, సత్యం వచ్చినట్లుంది, మాటలు వినిపించాయి.

"అమ్మా వాళ్ళింట్లో నిండుకున్నాయట."

"ష్. మెల్లిగా."

ఓ క్షణం మాటలు వినిపించలేదు.

అవంతి చిన్నగా యింకేదో అడుగుతోంది.

"ఊహూం. అక్కడకూడా లేవనేశారు."

పరిస్థితి కొంతవరకూ ఊహించుకున్నాను. వాసు బీదరికాన్ని వూహించుకున్నాను కానీ, మరీ ఇంత కటిక దరిద్రాన్ని ఊహించలేదు. ఈ ఇంట్లో ఇలా దొరికిపోయినందుకు నాకు లోలోపల కోపం ముంచుకొచ్చింది. వాసు మీద మరీ కోపం వచ్చింది.

అవంతి పోపుల డబ్బాలు సర్దుతూన్న చప్పుడు వినిపించింది.

"ఉన్నాయా?" సత్యం ప్రశ్న.

"చూస్తున్నా(నా."

తర్వాత అవంతి చిన్నగా అంటోంది. "చూడు సత్యం! ఈ డబ్బులు ఇస్తున్నాను. పావుశేరు బియ్యం తీసుకురా" పరిగెడుతున్న

సత్యంను ఆపి గద్గద స్వరంతో అంటోంది. "సత్యం! ఈ డబ్బుల్లో కమీషను తీసుకోకూ? దీంతో, పూర్తిగా బియ్యమే కొను. నీకు రేపు ఇస్తాను సరేనా? మన షావుకారు కొట్టులో తేకు. ఈ డబ్బులు తీసుకుని మన కాతాకి జమ కట్టుకుంటాడు. చిన్నబజారు వెళ్లి అక్కడ్నించీ తీసుకురా."

-- సత్యం వెళ్ళిపోయిన తర్వాత ఆ చీకట్లో స్నానం అయిందనిపించి, బయటపడ్డాను. గది లోకి వచ్చి బట్టలు మార్చుకున్నాను. అప్పటికి శాంతీ, శంకర్ గుమ్మందగ్గరే నిద్రపోతు న్నారు. ఎనిమిది గంటలు గాలిలో వినవస్తు న్నాయ్. ఓ చిన్నదీపం శాయశక్తులా మాసి పోయిన ఆ చిన్నగదిని వెలుగుతో నింపడానికి ప్రయత్నిస్తోంది. పందిరి మంచంమీద వాసు గుర్రుపెడుతున్నాడు. విరిగిన కుర్చీలో కూర్చు న్నాను. అక్కడ కనబడిన పాత పుస్తకం ఒకటి తీసి కొంతసేపు చదువుకున్నాను.

సత్యం వచ్చాడు. వంటింట్లోకి వెళ్ళి, చిన్నగా అడుగుతున్నాడు.

"మేంకూడా అన్నం తింటాం అమ్మా."

అవంతి మాటలు వినిపించలేదు.

"ఏమీ?" అంటున్నాడు సత్యం. తర్వాత వంటగదిలోంచి బయటకు వచ్చి పందిరి మంచంమీద పడుక్కున్నాడు. వాడి కళ్లు నిశితంగా పరిశీలించడం గమనిస్తూనే ఉన్నాను. కొంతసేపటికి వాడూ నిద్రపోయాడు.

పుస్తకం పట్టుకున్నానేకాని ఆలోచనల తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయ్. మనసంతా ఆవేదన అలుముకుంది.

"భోజనానికి లేస్తారా?" అవంతి పిలుపు వినబడింది.

"ఇదుగో వస్తున్నాను. శ్రమ ఇస్తున్నాను. ఈ రాస్కెల్ నేనెంత చెప్పినా వినకుండా తీసు కొచ్చాడు. మీకు చాలా కష్టం కలిగిస్తు న్నాను."

"శ్రమ తీసుకునే ఆతిథ్యం మేమీ ఇవ్వటం లేదు" వడ్డిస్తూ అంది అవంతి. "కూరలేం చేయలేదు."

ఏం అనాలో తోచలేదు నాకు.

"అమ్మా నాకో?" శాంతి ఎప్పుడొచ్చిందో వచ్చి నాకు యెదురుగా నిల్చుంది. "అన్నం పెట్టు మరీ" అంటోంది.

"శాంతీ చూడమ్మా, అన్నయ్యా, తమ్ముడూ యెలా పడుకున్నారో? అయినా నువ్వు అప్పుడే తినేశావుగా" నవ్వుతూ మందలింపుగా అంది "దొంగా! అప్పుడే తినేసి లేదం టూంది."

"పో. నేనెప్పుడు తిన్నానే? ఉదయంకూడా నాకు పెట్టలేదుకానీ? ఉదయం మరమరాలు ఇవ్వలే నువ్వు?"

"పదమ్మా. అలా అనకు. నీకు తర్వాత పెడతాలే పద" గద్గదంగా అంది.

"నాకు ఆకలి వేస్తోందే అమ్మా!"

అవంతి ఏడుపుని ఆపుకోలేకపోయింది. మొహం కప్పుకుంటూ వంటింట్లోనుండి బయ టకు వచ్చేసింది.

నేను ఒక్క ముద్దకూడా నోట్లో వేసుకో లేకపోయాను.

శాంతి ఏడుస్తోంది. శాంతిని పిలిచి, ఆ కంచం శాంతిముందు పెట్టి అన్నాను. "తిను శాంతీ. మరి, అన్నయ్యా తమ్ముడూ కూడా తినలేదా?"

శాంతి ఆవురావురుమని తింటూ నావేపు చూడకుండానే తల అడ్డంగా తిప్పింది.


"మరి అమ్మ?"

"అమ్మకూడా" నోట్లో అన్నం నిండుగా ఉండడంతో ముద్దగా అంది.

"మీ నాన్న డబ్బులు తేలేదా?"

సమాధానం చెప్పకుండా తింటోంది—శాంతి.

చెయ్యి కడుక్కొని ఇవతలి గదిలోకి వచ్చాను. అవంతి గోడమూల ఒరిగి ఏడుపుని ఆపుకునే ప్రయత్నం చేస్తోంది.




సూట్‌కేసులో ఉన్న డబ్బు తీసుకుని "ఇప్పుడే వస్తా"నని చెబుతూ బయటపడ్డాను. బజారుకి వెళ్ళి నెలరోజులకు కావలసిన గ్రాసం రిక్షాలో వేయించుకుని వచ్చాను.

అవంతి ఇంకా అక్కడే అలాగే కూర్చుని ఉంది.

సామానంతా రిక్షావాడి సాయంతో లోపల పెట్టించాను. "మీరు లేవాలి. లేచి అందరికీ వండండి."

అవంతి వెక్కి-వెక్కి ఏడుస్తోంది.

"నాకు ఆకలి వేస్తోంది. మీరు వండుతే తింటాను."

అవంతి లేచింది. నావేపు నిరసనగా చూసింది. పందిరిమంచంకేసి కోపంగా చూసింది. వంటింట్లోకి నడిచింది.


పిల్లలు భోజనం చేసి మళ్ళీ పడుకున్నారు.

ఆమె యెందుకో మనసులో యేడుస్తున్నదని గ్రహించాను. బహుశా నేను చేసిన ఈ సహాయానికి ఆమె మనసు సిగ్గుతో బాధపడుతోందేమో!

"మీరలా బాధపడకూడదు. మనిషిని మనిషి తప్ప ఇంకెవరు ఆదుకోగలరు చెప్పండి?" అని చెప్పాలనిపించింది. సిగ్గుతో, అభిమానంతో కుంగిపోతున్న మనుషులకు సానుభూతి మాటలు అంతగా రుచించవు. ఇష్టపడరు కూడా. భోజనం చేస్తున్నప్పుడు ఆమె మాటి మాటికీ కళ్ళంట నీళ్ళు పెట్టుకోడం కూడా నాకు అంత ఇష్టంలేకపోయింది.

పదకొండు గంటలయింది. అవంతి నాకు డాబామీద పక్క వేసింది. నేలనే పరుపు వేసి, తెల్లటి లుంగీపంచ దుప్పటిగా పరిచింది. చంద్రుడు అప్పుడే పైకి వచ్చాడు. వాతావరణంలో చల్లదనం చోటు చేసుకుంటోంది. నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి. గాలి తెరలు తెరలుగా వీస్తోంది. పడుకొన్నాను. అవంతి క్రింద వంటఇంట్లో సామాను సర్దుతున్న చప్పుడు వినిపిస్తోంది. సుందరి జ్ఞాపకానికొచ్చింది. సుందరికి ఇలాంటి రాత్రులంటే చాలా ఇష్టం.

# (వి)చిత్ర విజ్ఞానం



గాలిబ్ గీతాలను పాడని వారూ
వినని వారూ చాల అరుదు
గాలిబ్ గజల్స్ అనేక భాషలలోకి
అనువదించబడ్డాయి. ఒక అమెరికన్ కవి
గాలిబ్ గీతాలను ఆంగ్లంలో అనువ
దించడమే కాకుండా, గాలిబ్
చిత్రాన్ని కూడ గీశాడు!

---

అలికిడయింది. ప్రక్కకు తిరిగి చూసాను.

అవంతి!

ఈ సమయంలో

అరగంటక్రితం అవంతికి ఇప్పటి అవంతికి చాలా భేదముంది. ఇలాంటి సమయంలో ఈ విధంగా అవంతి రావడం చూస్తే వాసు యేమనుకుంటాడు? వణికిపోయాను. లేచి కూర్చున్నాను

అవంతి నా ఎదురుగా కూర్చుంది. సర్దుకుని దూరంగా జరిగాను.

"భోంచేశారా?" ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాను.

అవంతి ఏడుస్తోంది. వెక్కి వెక్కి మోకాళ్ళమీద తల ఆన్చి ఏడుస్తోంది.

"ఎందుకు చెప్పండి?" అడిగాను.

అవంతి కళ్ళల్లో అదే నిరసన భావం.

"ఎందుకు? ఏమయిందని?" మళ్ళీ అడిగాను.

స్నేహితుని భార్య నాకు చెల్లెలు వరసే. ఆ ఆత్మీయతను పురస్కరించుకుని దగ్గరగా, జరిగి భుజంమీద చెయ్యివేస్తూ చనువుగా అడిగాను "ఎందుకని చెప్పండి అవంతీ!"

వణుకుతున్న కంఠంతో, నాకు దూరంగా జరుగుతూ అంది.

"నేను అలాంటి దాన్ని కాదు రాజు గారూ!"

హతాసుడ్నయ్యాను.

"నేను నా పూర్తి ఇష్టతతో ఈ పనికి ఒప్పుకోలేదు. ఆయనే ఆయన బలవంతం మీద తప్పనిసరయింది."

ఆశ్చర్యపోయాను. దరిద్రం మనిషిచేత యెన్ని పనులు చేయిస్తుంది? వాసు ఆతిధ్యంలో అంతరార్థం బోధపడిన తర్వాత ఒక్కక్షణం కూడా ఆ ఇంట్లో ఉండలేకపోయాను.

ఆ వీధి మలుపు తిరుగుతుంటే నా వెనుక చాలా దూరంలో డాబామీద, కృతజ్ఞతా భావంతో చూస్తున్న రెండు కళ్ళల్లోని కన్నీటిని ఆ చీకటిలో స్పష్టంగా చూశానని పించింది. □